క్లుప్తంగా

కవులకు సన్మానం



కవులను సన్మానిస్తున్న వాకర్స్

చెన్నూర్: విజయవాడలో డిసెంబర్ 28, 29తేదీల్లో జరిగిన 6వ ప్రపంచ తెలుగు రచయితల మహాసభలలో చెన్నూర్ పట్టణానికి చెందిన ఉపాధ్యాయులు మేకల రామస్వామి, రిటైర్డ్ ఉద్యోగి మామిడి బాపులు పాల్గొని తెలుగు భాష గొప్పదనాన్ని చాటి చెప్పారు. చెన్నూర్ కవులను ప్రపంచ తెలుగు మహాసభల నిర్వాహకులు ప్రశంసా పత్రాలతో పాటు మెమోంటోలు అందజేశారు. మహాసభలలో పాల్గొని చెన్నూర్‌కు తిరిగి వచ్చిన కవులను చెన్నూర్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వాకర్స్ సభ్యులు కారెంగుల రామయ్య, ఎంపీడీవో మోహన్, గుర్రం శ్రీనివాస్, జక్కుల సత్యనారాయణ, గోవర్ధన్, పుట్ట కొండయ్య, దుద్దిళ్ల శంకర్, తదితరులు పాల్గొన్నారు.

6న ఉచిత కంటి వైద్యశిబిరం

కాసిపేట: మండలంలోని ముత్యంపల్లి హనుమాన్ టెంపుల్ వద్ద ఈ నెల 6న లయన్స్‌క్లబ్ ఆఫ్ మంచిర్యాల్ గౌతమి ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ఐ క్యాంప్ చైర్‌పర్సన్ ఉస్కెమల్ల రాజేంద్రప్రసాద్ తెలిపారు. ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం వరకు నిర్వహించే శిబిరాన్ని కాసిపేట మండల పరిసర ప్రాంతాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలిసిందిగా కోరారు. కంటి వైద్య శిబిరానికి వచ్చేవారు తెల్లరేషన్‌కార్డు, ఆధార్‌కార్డు జిరాక్స్‌లు తెచ్చుకోవాలని, పరీక్షల అనంతరం కంటి ఆపరేషన్‌లు అవసరమైతే క్లబ్ ఆధ్వర్యంలో చేపించనున్నట్లు తెలిపారు.

విద్యార్థి దశ నుంచే సివిల్స్‌పై అవగాహన



మాట్లాడుతున్న శేఖర్‌రావు

జన్నారం: విద్యార్థి దశ నుంచే సివిల్ సర్వీసెస్‌పై అవగాహన కల్పించడంతో పాటు పరీక్షలు రాయించడం అభినందనీయమని ట్రస్మా రాష్ట్ర ముఖ్య సలహాదారుడు యాదగిరి శేఖర్‌రావు అన్నారు. మండలకేంద్రంలోని స్లేట్ హైస్కూల్‌లో బుధవారం ఐఏఎస్ ఓరియంటేషన్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థుల తల్లిదండ్రులకు నిర్వహించిన సివిల్ సర్వీసెస్‌పై అవగాహన కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. సివిల్ సర్వీసెస్‌లో విద్యార్థులు విజయం సాధించి కలలు నెరవేర్చుకోవడం కోసం పాఠశాల యాజమాన్యం ఇస్తున్న ఈ ఓరియంటేషన్ కార్యక్రమం అద్భుత ఫలితాలు ఇస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సదస్సులో స్లేట్ విద్యాసంస్థల చైర్మన్ ఏనుగు శ్రీకాంత్ రెడ్డి, స్కూల్ ప్రిన్సిపాల్ షిరీన్ ఖాన్, తదితరులు పాల్గొన్నారు.

నియామకం

కాసిపేట: మండల కేంద్రానికి చెందిన నగురారపు సుమన్ తెలంగాణ వికలాంగుల వేదిక మంచిర్యాల జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైనట్లు బుధవారం తెలిపారు. తనపై నమ్మకంతో జిల్లా అధ్యక్షుడిగా నియమించినందున టీవీవీ వ్యవస్థాపకుడు మేకల సమ్మయ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పొన్నగంటి లలిత దేవి, రాష్ట్ర మహిళ అధ్యక్షురాలు బోట్ల సుమతి, రాష్ట్ర నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

ప్రభుత్వ భూమి కబ్జా



చదును చేస్తున్న కబ్జాదారులు

చెన్నూర్: చెన్నూర్ మున్సిపాలిటీ పరిధి సర్వే నంబరు 863లోని ప్రభుత్వ భూమిని కొందరు కబ్జా చేస్తున్నారు. స్థలాన్ని బుధవారం ట్రాక్టర్లతో చదును చేశారు. అయినా ప్రభుత్వ అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వచ్చాయి. కాగా, ఈ స్థలాన్ని జర్నలిస్టులకు ఇవ్వాలని 2015లో అసైన్‌మెంటు కమిటీ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదెలు, అప్పటి కలెక్టర్ ఆర్వీ కర్ణన్‌తో ప్రతిపాదించారు. ఈ మేరకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు. కలెక్టర్ బదిలీతో ఫైలు ముందుకు కదల్లేదు. అప్పటి నుంచి ఇప్పటివరకు జర్నలిస్టులకు కేటాయించకపోవడంతో రియల్టర్లు, కబ్జాదారులు భూ కబ్జాకు ప్రయత్నాలు చేస్తున్నారు. భూమి చదును విషయమై తహసీల్దార్ మల్లికార్జున్‌ను సంప్రదించగా.. తన దృష్టికి వచ్చిందని, రెవెన్యూ ఉద్యోగులను పంపించి పనులు నిలిపి వేయించామని, అక్రమంగా ట్రాక్టర్ పెట్టిన వారిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.



జైపూర్: టేకుమట్లలో సంబురాలు



మంచిర్యాలఅర్బన్: వేడుకల్లో మహిళలు



వేమనపల్లి: గొర్లపల్లిలో కేక్ కట్ చేసి వేడుకలు



బెల్లంపల్లి: కేక్ తినిపిస్తున్న సూపరింటెండెంట్ రవి



జైపూర్: పవర్ ప్లాంటులో వేడుకలు



మంచిర్యాలఅర్బన్: శ్రీనివాస అపార్ట్‌మెంట్‌లో కేరింతలతో నృత్యాలు

నయా జోష్..!

- అంబరాన్నంటిన నూతన సంవత్సర వేడుకలు
- అర్ధరాత్రి కేక్ కటింగ్‌లు
- ఇళ్ల ముందు రంగవల్లులు.. ఆలయాల్లో పూజలు



చెన్నూర్‌లో...

భీమారం/జైపూర్/వేమనపల్లి/బెల్లంపల్లి/కోటపల్లి/జన్నారం/తాండూర్/మందమర్రిరూరల్/చెన్నూర్/మంచిర్యాలరూరల్(హాజీపూర్): 2024 ఏడాదికి వీడ్కోలు పలుకుతూ జీవితాల్లో కొత్త వెలుగులు నింపాలని కోరుకుంటూ 2025 నూతన ఆంగ్ల సంవత్సరానికి స్వాగతం పలుకు తూ నిర్వహించిన కొత్త సంవత్సర వేడుకలు అంబరాన్నంటాయి. ఒకరికొకరు నూతన సంవత్స ర శుభాకాంక్షలు చెప్పుకుంటూ వేడుకలు ఆనందంగా జరుపుకున్నారు. కేక్‌లు కట్ చేసి, బాణా సంచా కాలుస్తూ వెలుగు దివ్వెల వె లుగుల్లో నూతన సంవత్సర వేడుకల్లో మునిగిపోయారు. విందు పార్టీలు ఏర్పాటు చేసుకొని జోష్ గా గడిపారు. మహిళలు, యువతులు, చిన్నారులు కలిసి ఇళ్ల లోగిళ్ల ముందు వేసిన రంగురంగుల అందమైన ముగ్గులు ప్రత్యేకంగా ఆకర్షించాయి. దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, వివిధ పార్టీల నాయకులు వేడుకల్లో పాల్గొన్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.



దండేపల్లి: కేక్‌కట్ చేస్తున్న యువకులు



మందమర్రిరూరల్: గుడిపెల్లిలో...



కోటపల్లి: న్యూ ఇయర్ వేడుకల్లో చిన్నారులు



మంచిర్యాలరూరల్(హాజీపూర్): దివాకర్ రావుకు పుష్పగుచ్ఛం అందిస్తూ...



భీమారం: ముగ్గు వేస్తున్న చిన్నారి

శ్రీరాంపూర్‌లో 114శాతం బొగ్గు ఉత్పత్తి



మాట్లాడుతున్న జీఎం ఎల్వీ సూర్యనారాయణ

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ ఏరియా గనుల్లో డిసెంబర్‌లో 114 శాతం ఉత్పత్తి సాధించినట్లు ఏరియా జీఎం ఎల్వీ సూర్యనారాయణ తెలిపారు. బుధవారం జీఎం కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఉత్పత్తి వివరాలు వెల్లడించారు. డిసెంబర్‌లో 5.78 లక్షల టన్నులకు గాను 6.56 లక్షల టన్నులు ఉత్పత్తి సాధించామన్నారు. శ్రీరాంపూర్ ఓసీపీలో అత్యధికంగా 162 శాతం, భూగర్భ గనుల్లో 90శాతం ఉత్పత్తి నమోదైందని తెలిపారు. డిసెంబర్ 27న 28509 టన్నుల బొగ్గు ఉత్పత్తి చేసి రికార్డు నమోదు చేశామని పేర్కొన్నారు. అదే రోజు 7 రేకుల బొగ్గు రవాణా చేసి మరో రికార్డు నమోదు చేశామన్నారు. గత నెల మొత్తం 157 రేకుల బొగ్గును రవాణా చేసినట్లు వెల్లడించారు. ఏరియాలో ఇప్పటి వరకు 3578 మందికి కారుణ్య ఉద్యోగాలు ఇచ్చామని తెలిపారు. గత సంవత్సరం 549 మందికి వివిధ కేటగిరిల్లో ప్రమోషన్లు ఇచ్చామన్నారు. ప్రతీ సంవత్సరం మాదిరి ఈ నెల 1న 240 మందికి సర్వీస్ లింక్ ప్రమోషన్లు (ఎస్ఎల్‌పీ) ఇచ్చినట్లు పేర్కొన్నారు. ఏరియా ఎస్ఓటు జీఎం సత్యనారాయణ, డీజీఎం(పర్సనల్) అరవిందరావు, డీజీఎం(ఐఈడీ) చిరంజీవులు, సీనియర్ పీవో కాంతారావు పాల్గొన్నారు.

ఘనంగా భీమా కోరేగావ్ శౌర్య దివస్



నివాళులర్పిస్తున్న ప్రజా సంఘాల నాయకులు

పాతమంచిర్యాల: జనవరి 1 శౌర్యదివస్ సందర్భంగా జిల్లా కేంద్రంలోని బైపాస్ రోడ్‌లో ఉన్న అమర వీరుల స్థూపం వద్ద భీమా కోరేగావ్ యుద్ధవీరులకు స్మరించుకుంటూ నేతకాని మహార్ సేవా సంఘం, సమతాసైనిక్ దళ్ భారతీయ బౌద్ధమహాసభ, అంబేద్కర్ సంక్షేమ సంఘం దళిత బహుజన సంఘాల ఆధ్వర్యంలో అమరవీరులకు కొవ్వొత్తులు వెలిగించి నివాళులర్పించారు. కార్యక్రమంలో సమతా సైనిక్ దళ్ తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దుర్గం సిద్ధార్థరామ్మూర్తి, నేతకాని మహార్ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దుర్గం స్వామి, ఎమ్మార్పీఎస్ నాయకులు దశరథం, అంబేడ్కర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు లింగయ్య, దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు దేవి పోచన్న, నాయకులు డూర్కె మోహన్, ఎడ్ల శంకర్, దుర్గం ఎల్లయ్య, డాక్టర్ నీలకంఠేశ్వర్‌రావు, రంగు రాజేశం, బౌద్ధ ఉపాసికులు అంబేడ్కర్ వాదులు పాల్గొన్నారు.

'భూమి కబ్జా చేసి ఇబ్బంది పెడుతున్నారు'



మాట్లాడుతున్న బాధితులు సత్యనారాయణ, పద్మ

కాసిపేట: మండలంలోని గురువాపూర్ శివారులోని తమ భూములను ఒక వ్యక్తి దొంగతనంగా పట్టా చేయించుకొని కబ్జా చేసి ఇబ్బందులకు గురి చేస్తున్నాడని మంథనికి చెందిన వృద్ధ దంపతులు ఇనిగంగి సత్యనారాయణరావు, పద్మ వాపోయారు. మండల కేంద్రంలోని కాసిపేట ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. అధికారులు సైతం వారికి సహకరిస్తున్నారని విమర్శించారు. తహసీల్దార్, పోలీసుల దృష్టికి తీసుకెళ్లినా తమకు ఎవరూ సహకరించడం లేదని, కబ్జాదారులకే సహకరిస్తున్నట్లు ఆరోపించారు. ఈ విషయాన్ని మంత్రి శ్రీధర్‌బాబు దృష్టికి తీసుకువెళ్లనున్నట్లు తెలిపారు. అధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని కోరారు.

వంట పాత్రలు అందజేత

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ కాలనీలోని భక్తాంజనేయ స్వామి ఆలయం ప్రాంగణంలోని అయ్యప్ప సన్నిదానానికి దాసరి రాములు కుటుంబం వంట పాత్రలను అందించింది. బుధవారం ఇక్కడి సన్నిదానంలో అఖిల భారత అయ్యప్ప ధర్మ ప్రచార సభ ఏరియా అధ్యక్షుడు బొడ్డు లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శి బాస్కర్ల రాజేశంలకు వీటిని అందించారు. కార్యక్రమంలో స్వాములు పాల్గొన్నారు.

కమాన్ ఏర్పాటు

మందమర్రిరూరల్: పట్టణంలోని కోల్‌బెల్ట్ రహదారి శ్రీ వేంకటేశ్వస్వామి దేవాలయం ఎదురుగా గల రైల్వేస్టేషన్ రోడ్డు వైపు బుధవారం సింగరేణి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన భారీ కమాన్‌ను వర్క్‌షాపు ఉద్యోగులు క్రేన్ ద్వారా ఏర్పాటు చేశారు. కొంతకాలం క్రితం రైల్వేస్టేషన్ రోడ్డులోని శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి, లక్ష్మీ నరసింహస్వామి ఆలయ కమిటీ సభ్యులు కమాన్ ఏర్పాటు కోసం సింగరేణిని అభ్యర్థించారు. వారి అభ్యర్థన మేరకు సింగరేణి అధికారులు కమాన్ ఏర్పాటు చేయించి నెలకొల్పారు.

నూతన రహదారి ఏర్పాటు



సాక్షి ఎఫెక్ట్..

చెన్నూర్‌రూరల్: మండలంలోని శివలింగాపూర్, అక్కెపల్లి గ్రామాలకు వెళ్లే రహదారిపై మొత్తం గుంతలు పడి అధ్వానంగా మారిందని 'పాత దారిపై పట్టింపేది' అని గత ఏడాది నవంబర్ 25న 'సాక్షి'లో కథనం ప్రచురితం అయ్యింది. స్పందించిన ప్రజాప్రతినిధులు, అధికారులు నూతనంగా రోడ్డు ఏర్పాటు చేయించారు. ఇందుకుగాను ఆయా గ్రామాల ప్రజలు, వాహనదారులు 'సాక్షి'కి కృతజ్ఞతలు తెలిపారు.

రక్షణతో బొగ్గు ఉత్పత్తికి కృషి చేయాలి



ప్రమోషన్ పత్రాలు అందిస్తున్న విజయ్ కుమార్



ఆర్డర్ కాపీలు అందిస్తున్న మేనేజర్ భూశంకరయ్య



కేకే-5 గనిపై కార్మికులతో ఇన్‌చార్జి మేనేజర్ రమేశ్

- పలు గనులపై కార్మికులకు ప్రమోషన్ పత్రాలు అందజేత
- ఉద్యోగులు మరింత బాధ్యతగా పనిచేయాలని సూచన

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ ఏరియాలోని పలు గనులపై కార్మికులకు సర్వీస్ లింక్ ప్రమోషన్లు (ఎస్ఎల్‌పీ) అందజేశారు. ఎస్ఆర్పీ 1 గనిపై బుధవారం జరిగిన కార్యక్రమంలో గని మేనేజర్ విజయ్‌కుమార్ ప్రమోషన్ పొందిన కార్మికులకు ఆర్డర్లను అందించారు. రక్షణతో పనిచేసి బొగ్గు ఉత్పత్తికి కృషి చేయాలన్నారు. ప్రమోషన్ పొందిన ఉద్యోగులు మరింత బాధ్యతతో పని చేయాలని సూచించారు. కార్యక్రమంలో గని రక్షణ అధికారి రాజేష్ కుమార్, సంక్షేమ అధికారి సాధన్, ఫిట్ సెక్రటరీ దాడి రాజయ్య, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

☞ ఆర్కే-6 గనిలో 34మంది ఉద్యోగులకు సర్వీస్ లింక్ ప్రమోషన్ల(ఎస్ఎల్‌పీ)ను గని మేనేజర్ ఈ తిరుపతి అందించారు.

కాసిపేట: మందమర్రి ఏరియా కాసిపేట 1ఇంక్‌లెన్‌లో 49 మందికి, 2ఇంక్‌లెన్‌లో 22 మందికి బుధవారం అధికారులు సర్వీస్ లింక్‌డ్ ప్రమోషన్ ఆర్డర్ కాపీలు అందజేశారు. మరింత బాధ్యతగా వ్యవహరిస్తూ ఉత్పత్తి, ఉత్పాదకతలతో పాటు సంస్థ మనుగడకు తమవంతు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో గనుల మేనేజర్లు భూశంకరయ్య, లక్ష్మీనారాయణ, గుర్తింపుసంఘం నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

మందమర్రిరూరల్: మందమర్రి ఏరియాలోని కేకే-5 గనిపై 22 మంది కార్మికులకు సర్వీస్ లింక్ ప్రమోషన్ (ఎస్ఎల్‌పీ) ఆర్డర్లను ఆ గని ఇన్‌చార్జి మేనేజర్ సీహెచ్ రమేశ్ అందజేశారు. రక్షణతో పనిచేస్తూ బొగ్గు ఉత్పత్తి లక్ష్య సాధనకు సహకరించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో గుర్తింపు కార్మిక సంఘం (ఏఐటీయూసీ) బ్రాంచ్ కార్యదర్శి సత్యనారాయణ, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

రిటైర్డ్ ఉద్యోగులకు సన్మానం



రిటైర్డ్ ఉద్యోగులను సన్మానిస్తున్న మేనేజర్ తిరుపతి

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ ఏరియాలోని ఆర్కే 6గనిలో రిటైర్డ్ అయిన ఉద్యోగులు వేల్పుల కొమురయ్య, అర్జున్ సర్కార్, రామ్‌టెంకీ లచ్చయ్య, కనుకుంట్ల కొమురయ్యలను బుధవారం గని పై జరిగిన కార్యక్రమంలో ఘనంగా సన్మానించి వీడ్కోలు పలి కారు. గని మేనేజర్ ఈ తిరుపతి వారిని శాలువాతో సత్కరించి మెమొంటోను అందించారు. రిటైర్మెంట్ తర్వాత శేష జీవితాన్ని సుఖసంతోషాలతో గడపాలన్నారు. కార్యక్రమంలో గని రక్షణాధికారి కాదాసి శ్రీనివాస్, డిప్యూటీ మేనేజర్ కొమురయ్య, ఫిట్ ఇంజనీర్ శ్యాం కుమార్, సీనియర్ పర్సనల్ ఆఫీసర్ సురేందర్, సర్వే అధికారి ఎస్పీ వర్మ, గుర్తింపు సంఘం ఫిట్ సెక్రటరీ సంఘం సదానందం, నాయకులు ముస్కె సమ్మయ్య, గొర్రె నరసయ్య, కారుకూరి నగేష్, రాంచందర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కాసిపేట గనులను సందర్శించిన జీఎం



కాసిపేట గనిపై మాట్లాడుతున్న జీఎం దేవేందర్

కాసిపేట: మందమర్రి ఏరియాలోని కాసిపేట 1-ఇంక్‌లైన్, కాసిపేట 2-ఇంక్‌లైన్ గనులను బుధవారం మందమర్రి ఏరియా జీఎం దేవేందర్ సందర్శించారు. ఈ సందర్భంగా వారికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేసి మాట్లాడారు. ఉద్యోగులందరూ వారి వ్యక్తిగత జీవితంలో లక్ష్యాలు, రక్షణతో కూడిన ఉత్పత్తి సాధించాలని కోరారు. కార్యాలయంలో మ్యాప్‌లు పరిశీలించి రోజువారీగా సాధిస్తున్న ఉత్పత్తి లక్ష్యాలు పెంచాలని, ఎల్లప్పుడు రక్షణతో కూడిన ఉత్పత్తి సాధించాలని సూచించారు. కాసిపేట 2-ఇంక్‌లైన్ గనిలో ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, గనిలో పని స్థలాలను పరిశీలించారు. విధి నిర్వహణలో రక్షణ సూత్రలు పాటిస్తే ఎటువంటి ప్రమాదాలు జరగవని, అధికారులు, సూపర్‌వైజర్లు, కార్మికులు సమన్వయంతో పనిచేయాలన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ బెల్లంపల్లి బ్రాంచి కార్యదర్శి దాగం మల్లేష్, ఏరియా రక్షణాధికారి రవీందర్, మేనేజర్లు భూశంకరయ్య, లక్ష్మీనారాయణ, ఫిట్ కార్యదర్శులు మినుగు లక్ష్మీనారాయణ, గొల్ల శ్రీనివాస్, రక్షణాధికారి నిఖిల్ అయ్యర్, సంక్షేమాధికారి గౌస్ జీశాన్, ఏఐటీయూసీ నాయకులు అధికారులు పాల్గొన్నారు.

ప్రతిభ కనబరిచిన ఉద్యోగులకు బహుమతులు



బహుమతి ప్రదానం చేస్తున్న మేనేజర్ తిరుపతి

శ్రీరాంపూర్: అధిక బొగ్గు ఉత్పత్తికి కృషి చేసిన ఆర్కే 7 గని కార్మికులకు అధికారులు బహుమతులు ప్రదానం చేశారు. గనిపై బుధవారం జరిగిన కార్యక్రమంలో నవంబర్ నెలలో అధిక ఉత్పత్తికి కృషి చేసిన ఎస్‌డీఎల్ ఆపరేటర్లు, కోల్‌కట్టర్స్, షాట్‌ఫైరర్, సర్దార్‌లను గని మేనేజర్ తిరుపతి సత్కరించి బహుమతులు అందించారు. మున్ముందు కూడా రాణించాలన్నారు. మిగితా కార్మికులు కూడా వీరిని ఆదర్శంగా తీసుకొని అధిక ఉత్పత్తికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో గుర్తింపు సంఘం ఏఐటీయూసీ డిప్యూటీ ప్రధాన కార్యదర్శి వీరబద్రయ్య, గని రక్షణాధికారి సంతోశ్‌రావు, అండర్ మేనేజర్లు రవీందర్, రాము, రవితేజ, రాజు, వెంటిలేషన్ అధికారి జగదీశ్, సంక్షేమ అధికారి శంతన్, ఏఐటీయూసీ బ్రాంచీ ఉపాధ్యక్షుడు కొట్టె కిషన్‌రావు, ఫిట్ సెక్రెటరీ మారుపల్లి సారయ్యలు పాల్గొన్నారు.

అధ్యాపకుడికి డాక్టరేట్



డాక్టరేట్ పట్టా అందుకుంటున్న తిరుపతి

లక్సెట్టిపేట: మండల కేంద్రంలోని ప్రభుత్వ మోడల్ డిగ్రీ కళాశాలలో ఎకనామిక్స్ అధ్యాపకుడిగా పనిచేస్తున్న మెరుపుటాల తిరుపతి, కరీంనగర్ శాతవాహన యూనివర్సిటీ నుంచి పీహెచ్‌డీ డాక్టరేట్ పట్టా అందుకున్నాడు. విశ్వవిద్యాలయంలో ఎకనామిక్స్ డిపార్ట్‌మెంట్‌లో విధులు నిర్వర్తిస్తున్న ప్రొఫెసర్ వరప్రసాద్ పర్యవేక్షణలో కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలోని స్వయం సహాయక బృందాల ద్వారా మహిళ సాధికారిత అనే అంశంపై పరిశోధన చేసినట్లు తెలిపారు. యూనివర్సిటీ వైస్‌చాన్సలర్ ఉమేష్‌కుమార్ చేతుల మీదుగా పట్టాను అందుకున్నట్లు తిరుపతి తెలిపారు.